# ఇంత - అంత

తిక్కల రాజాగారు కుక్కల్ని వెంటబెట్టుకుని బజారు బయలుదేరారు. రాజాగారి అంతరంగికుడు భద్రం కూడా వెంటనే వున్నాడు.

మార్కెట్ దగ్గరకొచ్చేటప్పటికి, ముక్కుపుటా లెగరేస్తూ, మువ్వన్నె గుర్రం ఆగిపోయింది.

"భద్రం! ఏమిటయ్యా ఏం జరిగింది"

"చిత్తం! మహాప్రభో! గుర్రం ఆగిపోయిందండి."

"ఎందుకని"

"ముక్కులు భరించలేని వాసనచేత ప్రభూ" ముక్కు మూసుకుని ముక్కుతో మాట్లాడసాగాడు భద్రం.

"ఏమిటా వాసన భద్రం?" కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ అడిగాడు రాజావారు.

"మిగిలిపోయిన కూరగాయలు బయట పారేయడంతో అవి కుళ్ళిపోయి వచ్చే వాసన ప్రభో" అని చెప్పి నోరు కూడా మూసేసుకున్నాడు భద్రం.

భద్రాశ్వం ఇక భరించలేక వెనక్కి తిరిగింది.

రాజావారికి కోపం పెరిగిపోయింది.

"కూరగాయలు పారేయడానికిటోయ్ భద్రం మనం పండిస్తున్నది?" ప్రశ్నించారు రాజావారు.

"లేదు మహాప్రభో! తినిపారేయడానికి పండిస్తున్నాం" ఆయాసపడుతూ అన్నాడు భద్రం.



"శభాష్! వెంటనే ఓ పని చెయ్యి! రేపటి నుంచీ మార్కెట్‌కి ఒక్క కూరగాయ కూడా వెళ్ళడానికి వీల్లేదు. అన్నీ కొని మన కోట స్టోర్ రూమ్‌లో భద్రం చేసెయ్! అప్పుడు తెలిసొస్తుంది ప్రజలకి వాటి విలువ.

"చిత్తం".

★ ★ ★

నెల రోజుల తర్వాత రాజావారితోపాటు హృద్యమైన ఫ్రెంచి మద్యం సేవిస్తున్న రాజావారి కుక్కలు ముక్కులు ఎగబట్టి చిరాగ్గా లోగొంతుకలో మూలగసాగాయి.

"భద్రం! ఏమిటోయ్ వీటి గోల?"

ముక్కుకి పెంటుగుడ్డ కట్టేసిన భద్రం వినయంగా అన్నాడు

"వాసన ప్రభూ! కుళ్ళు వాసన!"

"ఎక్కడోయ్?" అడిగారు రాజావారు.

"మన కోటస్టోర్ రూమ్‌లో ప్రభో!"

"ఇక్కడిదాకా వస్తోందా?"

"చిత్తం ప్రభూ! నెల రోజులుగా కొంటున్న కూరగాయలు మొత్తం అక్కడే వున్నాయ్"

"శభాష్! ప్రజలకి బుద్ధొచ్చిందా?"

"ప్రజలకే ఏమిటి ప్రభూ! మాక్కూడా వచ్చేసింది."

"అయితే వెంటనే ఆ కూరగాయలన్నీ కోటగోడ బయట పారేయించేసెయ్."